


# తృప్తి

— 'శైల'

బయట సన్నగా తుంపర పడుతోంది. బాల్కనీలోకి పాకిన సన్నజాజి తీగ వర్షంలో తడిసి, గాలికి బరువుగా ఊగుతోంది. మనసులో సాయంత్రం అమ్మ చెప్పిన మాటలే మోగుతున్నాయి. "మనిషికి జీవితమనేది దేవుడిచ్చిన గొప్ప వరం. దాన్ని అందరూ మలుచుకోవటం మనిషి కర్తవ్యం. ఇవ్వటంలో వున్న తృప్తి, ఎప్పుడూ తీస్కోవటంలో లేదు. అది ఎంత చిన్నదయినా సరే. పిచ్చిదానా! అందర్నీ డబ్బుతో నీచుట్టూ తిప్పుకుంటున్నావు, ఇన్ని హంగులూ, ఆర్భాటాలూ వున్నా నీకు మనశ్శాంతి వుందా? అది ఒకరిస్తే పుచ్చుకునేది కాదు. ఒక మాట, ఒక పాట, ఓ పువ్వు, వాన చినుకు, చంటి పాప నవ్వు, ఆఖరికి - మనసారా నువ్వు ఏడిస్తే అందులోనూ నీకు మనశ్శాంతి దొరుకుతుంది. అందుకని ఈ తపన, ఆరాటం మానుకో" అసహనంగా తన ఒళ్ళో కదిలే నా తలని ఆప్యాయంగా నిమురుతున్న ఆ చేతిని గట్టిగా పట్టుకున్నాను.

చిన్న వయసులో భర్తను పోగొట్టుకుని, అయిన వాళ్ళు ఆదరించకపోతే, నలుగురు పిల్లలతో నడివీధిలో నిలబడ్డ అమ్మ ఈనాడు ఏ సమస్యా లేకుండా, హాయిగా వేళకింత తిని, కృష్ణారామా అనుకుంటూ, గుళ్ళూ, గోపురాలు తిరుగుతూ, మనశ్శాంతితో శేష జీవితం గడుపుతోందంటే, దానికి కారణం నేనే అని ఆవిడకు తెలుసు. ఆవిడకున్న చింతల్లా నా గురించే. తక్కినపిల్లలందరూ జీవితంలో స్థిరపడి, హాయిగా వున్నారు. బహుశా నేను కూడా పెళ్ళి చేస్కుని, ఆ వచ్చే అతని మీద ఆధారపడితే మనశ్శాంతి దొరుకుతుందని అమ్మ అభిలాష కాబోలు. ఛస్తే దొరకదు. 'ఇండువిడ్యువాలిటీ' అనేది నాకు పుట్టుకతో వచ్చింది. అదేదో గొప్పతనంగా కూడా నేను భావించట్లేదు. నేనింకో వ్యక్తి మీద ఆధారపడలేను - అంతే. అందుకే పెళ్ళికీ, నాకూ సరిపడదు. ఇక మనశ్శాంతి కోసం ఈ నా అన్వేషణ ఇలా సాగాలేమో?

ఒకప్పుడు పూట గడవని పరిస్థితుల్లో, తండ్రి లేని ఇంటికి పెద్ద కూతురిలా బాధ్యతలు భుజాన వేస్కుని, అయినవాళ్ళని, స్నేహితుల్ని సహాయపడమని వేడుకున్నాను. సానుభూతి చూపకపోగా, చీదరించుకున్నారు. కారణం - నా తండ్రికున్న వ్యసనాలు, తద్వారా మేం కోల్పోయిన ఆస్తి, అంతస్తు. ఒకప్పుడు మా నాన్న చేసిన దానధర్మాల వల్ల పైకొచ్చిన వాళ్ళు సైతం మమ్మల్ని ఆదుకోలేకపోయారు. అలా ఎంత మంది చేత ఛీ కొట్టించుకున్నానో ఇప్పటికీ నాకు గుర్తే. అప్పుడే నా మనస్సులో నిర్ణయించుకున్నాను. ఛీ కొట్టిన వాళ్ళ చేతే కాళ్ళు పట్టించుకోవాలని - నేనంటూ ఓ నిర్ణయం తీసుకున్నాక దాన్ని ఇక ఎవరు చెప్పినా మార్చుకోను. ధృఢ నిశ్చయంతో బ్రతుకు పోరాటానికి సిద్ధమయ్యాను. ఆ పోరాటంలో నేనేం కోల్పోయానో అప్రస్తుతం. కానీ, సాధించాను, మకుటం లేని మహారాణిలా సినీ ప్రపంచంలో వెలిగిపోతున్నాను. ఇప్పుడు నా కటాక్ష వీక్షణాల కోసం తపించిపోయే బంధుజనం నేను 'ఛీ' అన్నా నా వెనకే తిరుగుతారు. కారణం నాకున్న పలుకుబడి. వాళ్ళకు కావాల్సిన పన్ల కోసం, నేనేమన్నా, ఎంత అవమానించినా నోరెత్తరు. పైగా - నన్నెంతో పొగుడుతారు. అదెంత నటనో నాకు తెలుసు. ఇదంతా నాకు తృప్తినివ్వాల్సింది పోయి చిత్రంగా నాకు మనశ్శాంతి కరువయింది. రాత్రుళ్ళు నిద్ర మాత్రలు లేందీ నిద్రపట్టదు. విరామం లేకుండా పనిచేసినా, "నేను చేస్తున్నది సరయిన పనేనా" అనిపిస్తుంది. మెడిటేషన్స్‌ని, అవనీ, ఇవనీ ఎన్నెన్నో ట్రై చేశాను. ఉహూఁ. ఏమీ లాభం కనిపించలేదు. అసలు కోరికలంటూ లేకపోవటమే మనశ్శాంతికి కారణమైతే - నిజంగా నాకే కోరికా లేదు. మరి ఈ తపన దేనికి?

★★★★

షూటింగ్ ఈపూటకి అయిపోయింది. బజార్లో పనుంటే, డ్రైవర్‌ని కారు ఓ షాపు ముందాపమన్నాను. నాక్కావలసింది లిస్ట్ రాసిచ్చి తెమ్మని, కారులో కూచున్నాను. బయటంతా పండగ హడావుడి. మా కారు పక్కనే సెకండ్ హాండ్ బట్టలమ్మే వాళ్ళు బట్టలు గుట్టలుగా పోసి అరుస్తున్నారు. నా దృష్టిని ఓ పాప ఆకట్టుకుంది. ఆ పాప, పక్కన వాళ్ళ అమ్మ కాబోలు సాదా బట్టల్లో మధ్య తరగతి కంటే కింది స్థాయికి ప్రతిబింబాల్లా వున్నారు.

ఆ పాప చేతిలో అన్ని రంగుల్లో ఇంతింత పువ్వులున్న కుచ్చుల గౌనుంది. వాళ్ళమ్మ ఆ గౌను బదులు ఇంకోటి - సాదా పూలది తీసుకోమని బతిమాలుతోంది. కొద్దిగా అద్దం దించి వాళ్ల మాటలు వినసాగాను. ఆ గౌను ధర ముప్పైకి తగ్గనంటున్నాడు. తల్లి ఎంత నచ్చజెప్పినా వినకుండా పాప ఆ గౌను గుండెకు హత్తుకుని, ఇవ్వనని మారాం చేస్తోంది. తల్లి నిస్సహాయంగా చూసి, మళ్ళీ మళ్ళీ బేరమాడుతోంది. కూతురు కోరుకున్నది కొనివ్వలేకపోతున్నానన్న బాధ ఆమె ముఖంలో ప్రతిఫలిస్తోంది. బట్టలమ్మే వాడు ముప్పైకి ససేమిరా తగ్గనంటున్నాడు. నాకెందుకో చాలా జాలేసింది. ఇంతలో డ్రైవర్ వచ్చాడు. డ్రైవర్‌కి పది రూపాయలిచ్చి సంగతి చెప్పి, పాపకా గౌను కొనివ్వమని చెప్పాను. డ్రైవర్ వెళ్ళి ఆవిడతో తక్కిన పది రూపాయలు తానిస్తానన్నాడు. అప్పుడు ఆవిడ చూసిన చూపు జన్మలో మర్చిపోలేను. ఖస్సున తాచులా చూచింది. ఏమీ మాట్లాడకుండా పాప చేతిలో గౌనువిసురుగా లాక్కుని విసిరేసి, పాప రెక్క పట్టుకుని లాక్కుపోవటానికి ప్రయత్నించింది. పాప బిగ్గరగా ఏడుస్తూ గింజుకోసాగింది. కోపమాపుకోలేక ఆ తల్లి ఓ దెబ్బ వేసింది. దాంతో గుడ్ల నీరు కుక్కుకుని, వెక్కిళ్ళు పెడుతూ ఏడుపాపింది పాప. ఎందుకో తెలీదు చెప్పరాని దుఃఖం కలిగింది నాకు. డ్రైవర్‌ని పిలిచి చెయ్యాల్సింది చెప్పాను. వాడు దూరంగా వెళ్ళి బట్టలమ్మే వాడికి సైగ చేశాడు. ఇరవైకి ఆ గౌనిమ్మని తక్కిన పది రూపాయలు తానిస్తానని.

అప్పటికే పాప, వాళ్ళమ్మ వెళ్ళిపోతున్నారు. ఆ పాప ఆశగా తిరిగి, తిరిగి ఆ గౌనునే చూస్తోంది. కొట్టువాడి పిలుపు విని వెనక్కి వచ్చారు. ఇరవై ఇచ్చి ఆ గౌను తీస్కున్నారు. ఆ పాప ఎంతో అపురూపంగా కాగితం పొట్లంలో చుట్టిన ఆ గౌను రెండు చేతుల్తోటి అందుకుని ఎంత చక్కటి నవ్వు నవ్విందంటే - ఆ నవ్వు నా జీవితాంతం మర్చిపోలేను. దాని తడి కళ్ళలో తృప్తితో కూడిన మెరుపును వర్ణించడం నా తరం కాదు. డ్రైవర్ తక్కిన డబ్బులిచ్చేసి వచ్చాడు. కారు మెత్తగా సాగిపోతోంది. నాకు తెలీకుండా నా కళ్ళలో నుంచి కన్నీళ్ళు కారిపోతున్నాయి. ఆ ఏడుపు ఎందుకో నాకు సరిగ్గా తెలీదు. కానీ అదెంతో హాయిగా, కరుడు కట్టిన నా గుండెను కరిగించినట్లుగా వుంది. రాత్రి ఏ నిద్ర మాత్రల అవసరం లేకుండా గాఢంగా, హాయిగా నిద్రపోయాను. నిద్రలో కూడా నా పెదవుల మీద 'తృప్తి'తో కూడిన నవ్వు కదిలే వుంటుందని నా నమ్మకం. ☐☐